మే1న మార్నింగ్ వాక్

రవీంద్రభారతి,ఏప్రిల్ 28 : ఆరోగ్యమే మహాభాగ్యం హెల్త్ ఇండియా అనే నినాదంతో ప్రజల్లో వ్యాయామం పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జాగో ఇండియా జాగో ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే 1నుంచి 30 వరకు నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో మార్నింగ్ వాక్ పోటీల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రస్టీ జావీద్ షరీఫ్ తెలిపారు. ఈ మేరకు బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జావీద్ షరీఫ్ మాట్లాడుతూ 5 నుంచి 50 ఏండ్ల వయస్సు గల నగర వాసులు ఉదయం 5 నుంచి 7 గంటల వరకు మార్నింగ్ వాక్ పోటీల్లో పాల్గొనాలన్నారు.కనీసం 28 రోజులు మార్నింగ్ వాక్‌లో పాల్గొనే వారి పేర్లు డ్రా తీసి ఒకరిని విజేతగా ప్రకటిస్తామని, విజేతకు రూ.50 వేల చెక్కును అందజేస్తామని తెలిపారు. సమావేశంలో సభ్యులు సయీద్, అక్బర్, సర్దార్, రాజేశ్ పాల్గొన్నారు.

జల సంరక్షణపై అవగాహన

స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న జలమండలి అధికారులు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 28: ఇంకుడుగుంత ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికీ వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని జలమండలి సహాయ సంచాలకుడు, భూగర్భ జలవిభాగం ఇంకుడు గుంతల ప్రత్యేకాధికారి జాల సత్యనారాయణ అన్నారు. మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని గాంధీయన్ బీఈడీ కాలేజీలో ఆదివారం 18 స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జల సంరక్షణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బహుళ అంతస్తుల్లో నీటి వినియోగం, ఇంకుడు గుంతల నిర్మాణం, వాటి నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువగా నీటి ట్యాంకర్లను వినియోగిస్తున్న ఇండ్లకు వెళ్లి భూగర్భ జలాల ప్రస్తుత పరిస్థితి, బోర్లలో నీటి నిల్వలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీజ్ఞాన్ ప్రతిష్ఠ సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ కడియం రమేశ్, తిరుపతి, గాంధీజ్ఞాన్ ప్రతిష్ఠాన్ సీఈవో టీ సురేందర్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సీఈవో చైతన్యరెడ్డి, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ సీఈవో శివకుమార్‌రెడ్డి, సాయికుమార్, తేజ, హిందుస్థాన్, హర్దీప్‌రెడ్డి, రాకేశ్, విజయ్, నవీన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారు..

రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్

ఖైరతాబాద్, ఏప్రిల్ 28 : ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ.. మాదిగల ఆత్మగౌరవాన్ని జీజేపీకి తాకట్టు పెట్టారని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ ఆరోపించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పదేండ్లుగా రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించకుండా ఉద్యమించిన వారిపై రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకు ఓట్లు వేయమన్నారు. ఈ సమావేశంలో నల్లాల కనకరాజు, నాను, పాలడుగు శ్రీనివాస్, కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి..

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలని టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇటురాజు మాదిగ అన్నారు. మాదిగల ఉపకులాల ఫ్రంట్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఏబీసీ వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం దళితులను మోసగించిందన్నారు. మందకృష్ణ మాదిగ బీజేపీ ఏజెంటుగా పనిచేస్తున్నాడని, ఆయన మాటలను ఎవరూ నమ్మవద్దన్నారు. ఈ సమావేశంలో టీఎంహెచ్‌డీ వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు మాదిగ, చింత ల రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం మధ్యాహ్నం ఎండ దంచికొట్టడంతో నగర వాసులు ఎవరూ బయటకు రావడానికి సాహసించలేదు. దీంతో నిర్మానుష్యంగా కనిపిస్తున్న వీఎస్టీ స్టీల్ బ్రిడ్జి

గ్రేటర్ @ 41.8 డిగ్రీలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఎండలు తారెత్తిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండటంతో నగరం అగ్నిగుండాన్ని తలపిస్తోంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41.8డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 28.7డిగ్రీలు, గాలిలో తేమ 24శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మండుతున్న ఎండల కారణంగా మధ్యాహ్నం సమయంలో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. పనులను సైతం సాయంత్రానికి లేదా రాత్రికి వాయిదా వేసుకుంటున్నారు. దీంతో పగటిపూట నిర్మానుష్యంతో పాటు రోడ్లు సాయంత్రం అయ్యేసరికి రద్దీగా మారుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

వేసవి తాపాన్ని తట్టుకునేందుకు సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

వాహనాలు జర భద్రం..!

- నగరంలో అధిక ఉష్ణోగ్రతలు
- మనుషులకే కాదు.. వాహనాలకూ ప్రమాదమే
- రంగు నుంచి ఇంధన ట్యాంకుల వరకు పరిశీలించాల్సిందే..
- ఎక్కువ కాలం వాహనాలను ఎండలో ఉంచొద్దంటున్న నిపుణులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : నగరంలో రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బయటకు వెళ్లాలంటే భానుడి భగభగలు చెమటలు పుట్టిస్తున్నాయి. అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లడం లేదు. ఇలాంటి పరిస్థితులతో నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. అయితే ఎండ కేవలం మనుషులకే కాదు వాహనాలను సైతం బేజారెత్తేలా చేస్తుందని ఆటో మొబైల్ రంగ నిపుణులు, మెకానిక్‌లు చెబుతున్నారు. వాహనాలను బయట వదిలితే.. అవి కొద్దికాలంలోనే రంగు, రూపు కోల్పోవడమే కాకుండా తరుచూ మరమ్మతులకు గురికావాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. కార్ల వంటి వాహనాల లోపలి భాగాలు కూడా తీవ్రంగా దెబ్బతింటాయంటున్నారు. వాహనాలు అసలు రంగు, మెరుపును కోల్పోతాయి. టైర్లు, సీట్లు, బ్యాటరీ, ఇంజిన్ లోపలి సున్నిత బాగాలు దెబ్బతింటాయి. ఇంధనం ఆవిరయ్యే ఆస్కారముంటుంది. కార్లలో ప్రమాదాల్లో కాపాడే ఎయిర్ బ్యాగ్‌లు కూడా దెబ్బతింటాయి. సీట్ల కుషన్లు, కవర్లు, అద్దాలు బలహీనమవుతాయని మెకానిక్‌లు చెబుతున్నారు. రోజుల తరబడి ఎండలో నిలిపితే కార్ల బాడీ కూడా దెబ్బతింటుంది.

జాగ్రత్తలు పాటిద్దాం..!

ఎండలో వాహనాలను నిలపాల్సి వస్తే తరుచూ వాటిని నీటితో శుభ్రం చేయడం, అద్దాలకు అడ్డుగా ప్యాడ్‌లను కట్టడం, మొత్తం వాహనాన్ని చుడుతూ కవర్లు బిగించడం ఉత్తమం. ఎండాకాలంలో ప్రతీ వాహనదారుడు కచ్చితంగా తరుచూ టైర్లు, బ్యాటరీలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవడం తప్పనిసరని ఆటో మొబైల్ నిపుణులు నాయుడు తెలిపారు. ఎండ నుంచి రక్షణ కల్పించే కోటెడ్ వ్యాక్స్ వాడటం మంచిదని తెలిపారు. అలాగే ఫిల్మ్ కూడా అందుబాటులో ఉంది. అవకాశం ఉంటే తప్పనిసరిగా వాహనాన్ని నీడలో నిలిపే ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రతీరోజు తరుచూ శుభ్రం చేయాలి. ఎక్కువ కాలం ఎండలో నిలిపిన వాహనాలను తిరిగి వినియోగించేటప్పుడు విధిగా టైర్లలో గాలి చెక్ చేసుకోవాలని సూచించారు. అలాగే బ్యాటరీ, ఇంధన ట్యాంకులు కూడా సరిచూసుకోవాలని చెప్పారు. అంతేకాదు ఉష్ణోగ్రతల కారణంగా కార్లలో ఇటీవల మంటలు వ్యాపిస్తున్నాయి. ఎలక్ట్రిక్ అమరికల కారణంగా ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో వాహనాల బాడీ స్టీల్‌తో నిర్మించేవారు. ప్రస్తుతం వేగంగా దూసుకెళ్లేందుకు, మైలేజీ పెంచేందుకు ఫైబర్, ప్లాస్టిక్ వినియోగం పెరగడం వల్ల కార్లు త్వరగా దగ్ధమవుతున్నాయి. నాసిరకం ఎలక్ట్రికల్ పరికరాలను ఉపయోగించడం కూడా ప్రమాదాలకు తావిస్తున్నాయి. సామర్థ్యానికి మించి లోడ్ పడినప్పుడు షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

లీఫ్ కార్వింగ్ ఆర్ట్.. ఆకులపై నృత్య భంగిమలు..

అమీర్‌పేట్, ఏప్రిల్ 28 : ఆకులపై సిరలను కత్తిరించకుండా సున్నితంగా ట్రిమ్ చేస్తూ చక్కటి కళాకృతులను తీర్చిదిద్దుతూ (లీఫ్ కార్వింగ్) సనత్‌నగర్ జెక్‌కాలనీకి చెందిన వాణిరెడ్డి ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఐటీ సంస్థలో ఉన్నత హోదాలో పని చేసి పదవీ విరమణ చేసిన వాణిరెడ్డి ప్రస్తుతం యోగా శిక్షకురాలిగా ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లలో తరగతులు నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం సరదాగా నేర్చుకున్న లీఫ్ కార్వింగ్ ఆర్ట్‌తో రావి, తమలపాకులపై చక్కటి ఆకృతులను తీర్చిదిద్దుతూ పలువురికి బహుమతులుగా అందజేస్తున్నారు వాణిరెడ్డి. సోమవారం జరుపుకోనున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అద్భుతమైన మూడు లీఫ్ కార్వింగ్‌లను రూపొందించారు. తన మనసులో మెదిలే ఆకారాలను ముందుగా పేపరుపై చిత్రించిన తరువాత ఆకులపై కార్వింగ్ చేస్తానని వాణిరెడ్డి తెలిపారు. ఒక్కో కార్వింగ్‌ను 10 నిమిషాల్లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. రెండు రావి ఆకులపై భారతీయ సంప్రదాయ నృత్య భంగిమలు, ఒక తమలపాకుపై పాశ్చాత్య నృత్య భంగిమను ట్రిమ్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. ఇందులో ఒక దానిపై రంగులు కూడా అద్దడంతో అది మరింత ఆకర్షణీయంగా ఉంది.

ఆర్ఎస్ఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు

ఆర్ఎస్ఎస్ చీఫ్ డాక్టర్ మోహన్ భగవత్

బడంగ్‌పేట, ఏప్రిల్ 28: సమాజంలో ఉన్న అసమానతలు తొలగిపోయే వరకు రిజర్వేషన్లు యాథావిధిగా ఉంటాయని ఆర్ఎస్ఎస్ చీఫ్ డాక్టర్ మోహన్ భగవత్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని నాదర్‌గుల్‌లో నూతనంగా నిర్మించిన విద్యాభారతీ విజ్ఞాన కేంద్రాన్ని త్రిదండి చిన జీయర్ స్వామితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్ భగవత్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల పై సంఘ్ పేరుతో జరుగుతున్న దుష్ప్రచారానికి ఆయన తెరదించారు. రిజర్వేషన్లకు ఆర్ఎస్ఎస్ వ్యతిరేకమని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతున్నదన్నారు. వాస్తవాలు తెలియకుండా తప్పుడు ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. మొదటి నుంచి సంఘ్ రిజర్వేషన్లకు అనుకూలంగా ఉందన్నారు. అనంతరం చిన జీయర్ స్వామి మాట్లాడుతూ.. దేశం సమస్యల్లో ఉన్నప్పుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకం చేశారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ్ అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్, క్షేత్ర ప్రచారక్ సుధీర్, క్షేత్ర సహ ప్రచారక్ భరత్, ప్రాంత ప్రచార్ లింగం శ్రీధర్, విద్యా భారతి క్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వర్ రావు, సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పసమర్తి మల్లయ్య, కార్యదర్శి సీతారాములు, పథకమూరి శ్రీనివాస్, రమేశ్ గుప్తా, విష్ణువర్ధన్ రాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

ముగిసిన పరుచూరి రఘుబాబు స్మారక పోటీలు

రంగస్థల పురస్కార గ్రహీతలతో సినీనటులు మురళీమోహన్, ఆర్.నారాయణమూర్తి

రవీంద్రభారతి, ఏప్రిల్ 28 : పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయ నాటక, నాటిక పోటీలు మూడురోజులుగా రవీంద్రభారతిలో ప్రధాన మందిరంలో ఘనంగా నిర్వహించారు. చివరి రోజు నాటక, నాటిక పోటీలు ప్రదర్శన అనంతరం బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీనటుడు మురళీమోహన్, ప్రముఖ విప్లవ నటుడు, దర్శకుడు, నిర్మాత ఆర్.నారాయణ మూర్తి విచ్చేసి పరుచూరి విజయలక్ష్మి రంగస్థల పురస్కారం, రంగస్థల మహానటిగా పేరొందిన వైజాగ్ విజయలక్ష్మికి 25వేల నగదుతో పాటు జ్ఞాపికను అందజేశారు. మూడు రోజుల పాటు జరిగిన నాటక, నాటిక పోటీలకు న్యాయనిర్ణేతలైన యండమూరి వీరేంద్రనాథ్, డా.డి.ఎస్.ఎన్ మూర్తి, బుర్రా సాయి మాధవ్, కోట శంకర్‌రావు, బి.అమరేంద్ర సమ్మేట వెంకటరమణ, ప్రాథమిక పరిశీలకులుగా జలదంకి సుధాకర్, అడపా సూరిబాబు, కోట ప్రసాద్‌కు ఐదువేల రూపాయలతో పాటు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరుచూరి గోపాలకృష్ణ, యండమూరి వీరంద్రనాథ్. డా.డి.ఎస్.ఎన్ మూర్తి, నటి శివపార్వతి పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని ఓడించండి..

- వ్యాపారవేత్తలు రాజకీయాల్లోకి వచ్చి వాటిని కలుషితం చేశారు..
- కేసులకు భయపడకండి.. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం..
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

మొయినాబాద్‌లో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

మొయినాబాద్, ఏప్రిల్ 28 : ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్న రంజిత్‌రెడ్డిని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తనూ సన్నద్ధం చేసేందుకు ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని స్టార్ కన్వెన్షన్‌లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ వ్యాపారవేత్తలు రాజకీయాల్లోకి వచ్చి వాటిని కూడా వ్యాపార కోణంలోనే చూస్తూ కలుషితం చేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తుల పట్ల బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలను కేసీఆర్ ఆదరించి చేరదీసి ఎంపీలుగా గెలిపిస్తే స్వార్థం కోసం పార్టీలు మారారని మండిపడ్డారు. రంజిత్‌రెడ్డికి సీఎం కేసీఆర్, కేటీఆర్ అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు.

ఓట్లు అడుక్కునే స్థితిలో..

చేవెళ్ల ఎంపీగా పనిచేసిన రంజిత్‌రెడ్డి ఎప్పుడు కూడా నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని.. అభివృద్ధికి కృషి చేయలేదని సబితారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన రంజిత్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని, ఆరు గ్యారెంటీలను చూసి ఓట్లు వేయాలని ఓటర్లను అడుక్కునే దుస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి జై శ్రీరాం అనండి ఓటేయండి...నరేంద్ర మోదీని చూసి ఓటేయాలని అడుగుతున్నారన్నారు. వారిద్దరూ నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ గతంలో రంగారెడ్డి జడ్పీచైర్మన్‌గా పనిచేసి ఎంతో అభివృద్ధి చేశారని.. బీసీ కులాల అభ్యున్నతికి పాటుపడ్డారని.. అలాంటి వ్యక్తిని మనందరం ఎంపీగా గెలిపించుకోవాలన్నారు.

న్యాయపరమైన చిక్కులు వస్తాయని తెలిసినా..

జీవో 111ను ఎత్తివేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని తెలిసినా.. సుప్రీంకోర్టు వరకైనా వెళ్లి పోరాటం చేస్తామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొని.. దానిని ఎత్తివేస్తున్నట్లు జీవోను జారీ చేయించారని గుర్తు చేశారు. జీవో 111 ఎత్తివేత కోసం తీసుకొచ్చిన జీవో 69ను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసానిని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని..ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో 140 రోజుల్లోనే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కరెంట్ పోయిన ప్రతిసారి ప్రజలకు కేసీఆర్ గుర్తుకొస్తున్నారని తెలిపారు. కార్యకర్తలందరూ సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలని.. కేసులకు భయపడొద్దన్నారు. ప్రతి కార్యకర్తకూ స్థానిక ఎమ్మెల్యే నుంచి కేసీఆర్ వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను అధిక మెజార్టీతో గెలిపించేందుకు ఇంటింటికెళ్లి బీఆర్ఎస్ హయాంలో అమలైన పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. సమావేశంలో చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి రాంబాబుయాదవ్, రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, జడ్పీటీసీ కాలె శ్రీకాంత్, సీనియర్ నాయకులు ఆంజనేయులు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ రితీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గణేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహాగౌడ్, ఉపాధ్యక్షుడు జయవంత్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు రవూఫ్, వెంకట్‌రెడ్డి, రాజు, మాజీ సర్పంచ్ శ్రీహరియాదవ్, సీనియర్ నాయకులు మహబూబ్, కృష్ణారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పరమేశ్, యాదగిరిచారి, మనోజ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, రాంరెడ్డి, రాఘవేందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆంధ్రా ప్రయాణం..పిరం.!

- వేసవి సెలవులు, ఎన్నికలతో పెరిగిన రద్దీ
- కిటకిటలాడుతున్న బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : వేసవి సెలవులు, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చాలా మంది నగరం నుంచి తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. ముఖ్యంగా ఓట్ల తేదీ సమీపిస్తుండటంతో కుటుంబ సమేతంగా వెళుతున్నారు. దీంతో బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. బుకింగ్ చేసుకోవడానికి కూడా నెల రోజుల వరకు టికెట్లు దొరకని పరిస్థితి ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో చాలా మంది జనం ట్రావెల్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కొన్ని ట్రావెల్స్ రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రూ.800 ధర ఉంటే సుమారు 2వేల పైనే వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. రైల్వే, ఆర్టీసీ అధికారులు ఏపీకి ప్రత్యేక రైళ్లు, బస్సు సర్వీసులను పెంచాలని ప్రయాణికులు కోరారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సుల్లో సీట్లను ఏర్పాటు చేసి ప్రయాణికుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. అధిక డబ్బులు వసూలు జేస్తున్న ట్రావెల్స్‌పై ఆర్టీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌ను ఓడిద్దాం..

- ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 28: తెలంగాణలో ప్రజా పాలన పేరుతో రెడ్డిల ఆధిపత్యం కొనసాగుతున్నదని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. రేవంత్ ఆఫీసులోని అటెండర్ నుంచి మొదలుకుని సలహాదారుల వరకు, న్యాయవ్యవస్థ నుంచి కార్పొరేషన్ చైర్మన్ వరకు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, చివరికి ప్రభుత్వంలో పూర్తిగా రెడ్డిల ఆధిపత్యమే కొనసాగుతోందని ఆరోపించారు. దళితులలో మెజారిటీ కులస్తులైన మాదిగలకు పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. చివరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల్లో కూడా మాదిగలకు స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ స్థానాల్లో రెడ్డి సామాజిక వర్గానికి పెద్ద పీట వేసి, తెలంగాణలోని 52 శాతం జనాభా కలిగిన బీసీలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. అమలు కాని ఆరు గ్యారెంటీల పేరుతో రాష్ట్రంలోని 93 శాతం ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.